# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**2.** తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని తెలంగాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు.

**3.** అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జూన్ 16వ తేదీకి వాయిదా పడింది.

**4.** తెలంగాణాలో కురుస్తున్న అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**5.** ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాలో నేడు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది.

===========================

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాతో కలిసి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిన్న సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వెబ్ సైట్లన్నిటిలో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఫొటోలు, ఆడియో, వీడియోలు వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఫొటోలను,ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయపరమైన ప్రకటనలన్నీ తొలగించాలని నిర్దేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై విచారణ జరిపి కఠిన చర్యల తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కొత్త పథకాలు ప్రకటించడానికి వీలులేదన్నారు. నూతన ప్రాజెక్టులు, పథకాలు, రాయితీలు, గ్రాంట్ల మంజూరు, హామీలు, శంఖు స్థాపనలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల ప్రకటనలను నిలిపి వేయాలన్నారు. ఎన్నికల

ప్రకటన వచ్చాక మంత్రులెవరూ అధికారిక వాహనాలను వినియోగించరాదని స్పష్టం చేశారు.

---------------------------

తెలంగాణాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఆమె నిన్న సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటి అవసరాలకు ఏ విధమైన ఇబ్బందులు లేవని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని... మంచినీటి సరఫరా విషయంలో ఆందోళన అవసరం లేదని శాంతికుమారి పేర్కొన్నారు.

---------------------------

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష, ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ 2024 పరీక్షలు వాయిదా పడ్డాయి. గతంలో వేర్వేరుగా ప్రకటించిన రెండు నోటిఫికేషన్ల ప్రకారం.. ప్రిలిమినరీ పరీక్ష మే 26న జరగాల్సి ఉండగా... లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ పరీక్షలను రీషెడ్యూల్ చేస్తూ యూపీఎస్సీ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు పరీక్షలను జూన్ 16న నిర్వహించాలని నిర్ణయించినట్లు యూపీఎస్సీ నిన్న ఒక ప్రకటనలో వెల్లడించింది.

---------------------------

తెలంగాణాలో రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అక్కడక్కడా పంట నష్టం సంభవించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వచ్చే రెండు మూడు రోజులూ ఇదే వాతావరణ పరిస్థితి ఉండే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం, మిర్చి, ఇతర పంటలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా... ఆయిల్‌పామ్ రైతులను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులతో నిన్న జరిగిన రైతునేస్తం దృశ్యమాధ్యమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆయిల్‌పామ్‌తో రైతులకు లాభాలు చేకూరుతాయని... రైతులకు సబ్సిడీలు, రాయితీలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోన్ని వాణిజ్య స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించ వద్దని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన నిన్న దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షించారు. ప్రస్తుతం హైవేలు, మెయిన్ రోడ్ల పక్కనున్న హోర్డింగులను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున కొత్తగా అనుమతులు ఇవ్వవద్దని సూచించారు.

---------------------------

ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాలోని వివిధ ప్రాంతాల్లో నేడు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి

వాతావరణ కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.అలాగే, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది.  కాగా, నిన్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

---------------------------

ఎర్త్ అవర్ డేలో భాగంగా తెలంగాణా వ్యాప్తంగా ఈనెల 23న రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు గంట సమయం పాటు విద్యుత్ దీపాలను ఆర్పివేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ కోరారు. ఆమె నిన్న హైదరాబాద్‌లోని సచివాలయంలో 'ఎర్త్ అవర్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులు, జీవ–వైవిధ్య నష్టం, పర్యావరణాన్ని రక్షించడానికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు స్విచ్ ఆఫ్ పవర్ ద్వారా ఎర్త్ అవర్ పాటించాలని ఆమె కోరారు.  సచివాలయం, దుర్గం చెరువు, బీఆర్ అంబేద్కర్ విగ్రహం, బుద్ధ విగ్రహం, గోల్కొండ కోట, చార్మినార్, స్టేట్ లైబ్రరీ, రాష్ట్రంలోని ఇతర స్మారక చిహ్నాలన్నింటిలో కూడా విద్యుత్ దీపాలను ఆర్పివేయాలని ఆమె కోరారు.

---------------------------

అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని కాపాడుకునే లక్ష్యంతో ఈరోజు ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పాటిస్తున్నాం. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. "నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా" ఫ్రాన్స్‌కు చెందిన "ఎకో–సిస్ యాక్షన్" ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న సహజ జీవవైవిధ్య జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి.. అందుకోసం క్రియాశీలకంగా పనిచేసేలా ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ లక్ష్యం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున.. కార్యకలాపాల కవరేజీ కోసం అధీకృత లేఖలు పొందిన మీడియా ప్రతినిధులకు కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించింది. ఈ మేరకు  నిన్న నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అత్యవసర సేవల విభాగాల్లో పనిచేసే వారు పోలింగ్ రోజున విధుల్లో ఉండాల్సి వస్తే వారూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చని సూచించింది. విద్యుత్తు, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలీగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, స్టేట్ మిల్క్ యూనియన్, పాల సహకార సంఘాలు, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, పోలీసులు, అంబులెన్స్‌లు, షిప్పింగ్, జైలు సిబ్బంది, ఎక్సైజ్, తాగునీటి సరఫరా అథారిటీలు, ఖజానా సేవలు, అటవీ శాఖ, సమాచార, పౌరసంబంధాల శాఖాధికారులు,  పీఐబీ, నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అత్యవసర సేవల విభాగాల్లో పనిచేసే వారు పోలింగ్ రోజున విధుల్లో   ఉండాల్సి వస్తే పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తారు.

సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిన్న మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పోలింగ్ కేంద్రానికి వెళ్లలేని వయోవృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. వారి దరఖాస్తులను పరిశీలించి రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని ఆదేశించింది.

–––––––––––––––––––––––––––

రైళ్లు కదులుతున్న సమయంలో ఎక్కడం, దిగడం, పట్టాలు దాటడం చట్టరీత్యా నేరమని, ప్రాణహాని జరిగే ప్రమాదం ఉందని దక్షిణ మధ్య రైల్వే హెచ్చరించింది. భద్రత విషయంలో రైల్వేశాఖకు సహకరించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. రైలు బయలుదేరే సమయంలోనూ, స్టేషన్‌కు చేరుకునేటప్పుడు రైళ్లు ఎక్కడం, దిగడం వంటి ప్రయత్నాలు చేయవద్దని, నిషేధిత ప్రాంతం నుంచి రైల్లోకి ప్రవేశించవద్దని స్పష్టం చేసింది. రైల్వే ట్రాక్‌ల పరిసర ప్రాంతాలలో సెల్ఫీ, ఫొటోగ్రఫీ తీసుకోవడంపై నిషేధం ఉందని దక్షిణమధ్య రైల్వే పేర్కొంది.

======================